# నా సాహితీ జీవనంలో జరిగిన కథ

## మల్లాది వెంకట కృష్ణమూర్తి



కేవలం 'కౌముది' పాఠకుల కోసమే మల్లాది గారు మొట్టమొదటి సారిగా వ్రాస్తున్న సంచలనాత్మక శీర్షిక

*1970 నుంచి సాహిత్య మార్గంలో నాకు ఎదురైన అనేక సంఘటనలని, అనుభవాలని పాఠకులతో పంచుకోవడానికి ఈ శీర్షికను ఆరంభిస్తున్నాను. తరచూ నన్ను పాఠకులు అడిగే అనేక ప్రశ్నలకి జవాబులు ఇందులో దొరుకుతాయి. నాకు ఈ మార్గంలో పరిచయం ఉన్న అనేకమంది ప్రముఖుల గురించి రాసే వివిధ విషయాలు, వారితో నా అనుభవాలు చదవడానికి పాఠకులకి ఆసక్తిగా ఉంటాయని విశ్వసిస్తున్నాను. నాకు డైరీ రాసే అలవాటు లేదు కాబట్టి తారీఖులు, నెలలు, సంవత్సరాలు, కొందరి పేర్లు అన్ని సందర్భాల్లోనూ ఇవ్వలేను. అందుకని కేవలం జరిగిన వాటి సారాంశాలని మాత్రమే ఇవ్వగలను. ఎలాంటి దాపరికాలు లేకుండా రాయదలచుకున్నాను కాబట్టి పాఠకులు దీన్ని కల్పితంగా భావించనవసరం లేదు. ఏ విషయం మీదైనా వారు ఇంకాస్త వివరాలు తెలుసుకోడానికి ప్రశ్నలు వేయచ్చు. అలాగే ఏ విషయం మీద తెలుసుకోవాలని ఉందో దాన్ని అడిగితే ఆ వివరాలు రాస్తాను. అయితే ఓ టాపిక్కు ముగిసేదాకా ఆగి దాని మీద నేను చెప్పనివాటి గురించి అడిగితే ఎవరికీ సమయం వృధాకాదు. మీరు టాపిక్కులని సూచించవచ్చు. నేను రాయదలచుకున్న జాబితాలో అవి ఉంటే సరే. లేకపోతే మిగతా పాఠకులకి, నాకు ఈ విషయంలో సహాయం చేసినవారు అవుతారు. అనుమానం ఉన్న సంగతులని వదిలేయదలిచాను కాని అసత్యాలని మాత్రం రాయదలచుకోలేదు. కొందరికి ఇవి బాధని కలిగించవచ్చు. కాని సత్యానికి దగ్గరగా ఉండాలంటే ఇది తప్పదు.* - మల్లాది

If there's a book you really want to read, but it hasn't been written yet, then you must write it.

~Toni Morrison

# కందనాతి చెన్నారెడ్డి

1980లలో భూమి వీక్లీ విజయం తరువాత చాలా వారపత్రికలు పుట్టుకు వచ్చాయి. వాటిలో ఒకటి పల్లకి వీక్లీ. భూమి తరువాత అంతటి ప్రాచుర్యం పొందిన వారపత్రిక పల్లకి. దీని స్థాపకుడు శ్రీ కందనాతి చెన్నారెడ్డి. దీన్ని ఆవిర్భావం వెనుక అనేక సంఘటనలు జరిగాయి.

1980లలో ఆంధ్రభూమి డైలీ, వీక్లీ, డెక్కన్ క్రానికల్ డైలీ వెలువరించే ప్రచురణ సంస్థకి జనరల్ మేనేజరుగా కందనాతి చెన్నారెడ్డి వ్యవహరించేవారు. ఆయన ఆ సంస్థ అధిపతి పి. చంద్రశేఖర రెడ్డి సమీప బంధువు. మేనేజింగ్ ఎడిటర్‌గా ఆంధ్రభూమి వీక్లీలో ఆయన పేరే ప్రచురించేవారు. ఎడిటర్‌గా సికరాజు పేరు వేసేవారు. చాలా మంది పాఠకులు ఆయనే ఎడిటర్ అని భ్రమపడేవారు.

వ్యక్తిగత కారణాలవల్ల ఆ సంస్థ నుంచి చెన్నారెడ్డి బయటకి వచ్చేసారు. స్వంత వ్యాపారం పెట్టుకోవాలని ఆయన ఆలోచించినప్పుడు సహజంగానే భూమి వీక్లీలో పాపులర్ అయిన తన పేరుకి అనుగుణమయిన తన పరిచయాలను వాడుకునే వ్యాపారం పెట్టుకోవాలని నిశ్చయించారు. ఆయన భూమిలో పనిచేస్తుండగా రచయితలు ఎవరూ చెన్నారెడ్డిగారికి తెలియదు. ఆయన వారపత్రికని పెట్టాలనుకోగానే సికరాజుని తన కొత్త పత్రికకి ఎడిటర్‌గా రమ్మని కోరారు. కానీ సికరాజు అందుకు అంగీకరించలేదు. కారణం ఆంధ్రభూమి చాలాకాలంగా వస్తోంది. అత్యధిక సర్క్యులేటెడ్ వారపత్రిక అయింది. దాన్ని ప్రచురించే సంస్థ కూడా చాలాకాలంగా ఉన్న బలమైన సంస్థ. ఇప్పుడు మళ్ళీ ఓ కొత్త పత్రిక డిజైన్ చెయ్యాలి తను అభివృద్ధి చేసిన 'భూమి'కే పోటీగా దాన్ని నడపాలి. చెన్నారెడ్డిగారు స్వతహాగా బాగా పొదుపు మనిషి. సికరాజు అప్పుడున్న సంస్థలో పిసినారితనం లేదు. పైగా మంచి సంస్థలో పనిచేసే తను, ఓ వ్యక్తి నడిపే సంస్థకు వెళ్ళడం మంచిదికాదనుకున్నారు. అదీకాక చెన్నారెడ్డి, చంద్రశేఖర రెడ్డిల మధ్య కుటుంబ పరంగా బేధాభిప్రాయాలు వచ్చాయని అందుకని చెన్నారెడ్డిని బయటకు పంపడమో లేదా ఆయనే కొనసాగడం ఇష్టం లేక వెళ్ళడమో జరిగిందని వినికిడి. దాంతో సికరాజు చెన్నారెడ్డిగారిని కలిసి పత్రిక గురించి మాట్లాడడానికి భయపడ్డారు. అది టి. చంద్రశేఖర రెడ్డిగారికి తెలిస్తే తన మీద కోపం వచ్చి ఉద్యోగంలోంచి తీసెయ్యవచ్చని భయపడ్డారు.

తను బహిరంగంగా కాక గుప్తంగా ఎడిటోరియల్ మద్దతుని ఇస్తానని సికరాజు చెన్నారెడ్డిగారికి చెప్పారు. చెన్నారెడ్డిగారికి రాజభవన్ రోడ్డులో ఓ సందులోంచి లోపలికి వెళితే హుస్సేన్ సాగర్ వద్దున ఓ పాత భవంతి ఉండేది. దాన్ని వారపత్రికకోసమే కొన్నారో లేదా ముందునుంచే అది వారికి చెందిందో తెలియదు. చెన్నారెడ్డిగారు ఆరంభించే వారపత్రికకి సహాయకుడిగా భూమి వీక్లీలో పనిచేసే చిత్రకారుడు త్రిగుణ్ రాజీనామా చేసి వెళ్ళాడు. భూమి ఫార్మాట్ త్రిగుణ్‌కి బాగా తెలుసు కాబట్టి చెన్నారెడ్డిగారు ప్రత్యేకంగా సికరాజుకి జీతం ఇచ్చి రహస్య సలహాదారుడిగా పెట్టుకోదలుచుకోలేదు. ఇది గ్రహించిన సికరాజు, త్రిగుణ్ మీద మండిపడ్డారు.

విజయవాడనుంచి 'రేపు' సైకలాజికల్ మాసపత్రికని నరసింహారావు అనే అతను తెచ్చేవారు. అప్పట్లో అది సెన్సేషనల్ మాసపత్రిక. నరసింహారావే అందులోనివన్నీ రాసేవారని విన్నాను. ఆ పత్రికలో శివప్రసాద్ అనే అతను పనిచేసేవాడు. అలాగే పింగళి దశరధరాం 'ఎన్ కౌంటర్' మాసపత్రికలో త్రివిక్రమరావు (విక్రం) అనే అతను పనిచేసేవాడు. పల్లకికి సిబ్బందిని తెచ్చే బాధ్యత త్రిగుణ్ మీద ఉంది. విజయవాడలో త్రిగుణ్ చాలా కాలం పనిచేసాడు. ఏలూరు రోడ్డులోని పబ్లిషర్స్ జర్నలిస్టులు అతనికి బాగా తెలుసు. త్రిగుణ్ 'పల్లకి'కి శివప్రసాద్, విక్రమ్‌లని తెచ్చాడు. వారిద్దరూ కలిసి పల్లకి ఫార్మాట్ మీద పనిచేయసాగారు.

ఓ రోజు 'భూమి'లో రాసే రచయితలందరినీ 'పల్లకి' ఆఫీసులో జరిగే రైటర్స్ మీట్‌కి ఫలానా రోజు సాయంత్రం రమ్మని ఆహ్వానాలు అందాయి. త్రిగుణ్ అందరికీ ఫోన్లు చేశాడు. ఆనాటి భూమి వీక్లీలో రెగ్యులర్‌గా రాసేవారంతా ఆ మీటింగ్‌కి హాజరయ్యాము. రాజభవన్ రోడ్డులోని టాంకు బండ్ వేపున్న ఆ సందులోకి వెళితే ఎడమ వైపు రోడ్డులో చలసాని ప్రసాదరావు గారి ఇల్లు, కుడివైపు

రోడ్డులోకి మళ్ళితే చెన్నారెడ్డి బిల్డింగ్ ముందు ఆ సందు ఆగిపోతుంది. విశాలమైన ఆవరణలో 50 ఏళ్ళ క్రితమే అంటే 1930ల ప్రాంతంలో కట్టిన ఆ పురాతన భవంతికి సున్నం వేసి ఉంది. బయట పండాల్ వేసి ఉంది. త్రిగుణ్ మమ్మల్ని రిసీవ్ చేసుకుని చెన్నారెడ్డిగారికి అందరినీ పరిచయం చేసారు. ఆయన ఆ బిల్డింగులో కింది అంతస్తులోని ప్రెస్‌ని పై అంతస్తులోని ఎడిటోరియల్ ఆఫీస్‌ని మాకు చూపించారు. మేడమీదనుంచి దూరంగా కట్టే ఓ అపార్టుమెంట్ కాంప్లెక్స్‌ని చూపించి చెన్నారెడ్డి చెప్పారు. 'అందులో నాలుగు ఫ్లాట్స్ బుక్ చేసాను. వాటిని నాలుగుకాలాల పాటు ఉండే 'పల్లకి' సిబ్బందికి ఇస్తాను. దగ్గరగా ఉంటారు'

అది అబద్ధమని ఆనాడు నాకు తెలియలేదు. అవి పూర్తయ్యాయి కానీ 'పల్లకి' సిబ్బందికి వాటిని కేటాయించలేదు. అసలు వాటిని ఆయన కొన్నారని కూడా నేనిప్పుడు భావించడంలేదు.

'పల్లకి' నాలుగు కాలాల పాటు ఉంటుంది అన్న ఆయన మాటలు కూడా అబద్ధాలే అయ్యాయి.

శివప్రసాదుని 'పల్లకి' ఎడిటర్‌గా చెన్నారెడ్డిగారు మా అందరికీ పరిచయం చేసారు. సన్నగా పొడుగ్గా బండకళ్ళద్దాలు కల 30, 35 ఏళ్ళ మధ్య గల శివప్రసాదుని మాలో ఎవరం అంతకు మునుపు చూడలేదు.


విక్రం

శివప్రసాదుతో నాకు పరిచయం అయ్యేకొద్దీ అతనో చిత్రమైనవాడని నాకనిపించసాగింది. ఇది నా ఒక్కడి అభిప్రాయమే కాదు. విక్రం, త్రిగుణ్, అనేకమంది రచయితలు ఆర్టిస్టులు ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేసేవారు. అతనిలో నేను శాడిజాన్ని గమించాను. అభద్రతా భావం అతనిలో చాలా తీవ్రంగా ఉండేది. తన ఉద్యోగం ఎక్కడ పోతుందో అనే భయంతో విక్రంని బయటకు పంపించేశాడు. అతను వెళ్ళి మయూరి వీక్లీలో చేరాడు. విక్రమ్ ప్రస్తుతం రాజకీయ విశ్లేషకుడిగా చిరంజీవితో ఉన్నారు.

లోపాలు లేని మనుషులే ప్రపంచంలో ఉండరు. చెన్నారెడ్డిగారిలోని లోపాల్లో ఒకటి ఇతరులు చెప్పింది వెరిఫై చేయకుండా నమ్మడం. నమ్మించడంలో శివప్రసాద్‌ది అందెవేసిన చెయ్యి కాబట్టి విక్రంని బయటకు పంపగలిగాడని ఆ తరువాత విక్రం ద్వారా తెలిసింది.

ఓసారి శివప్రసాదుతో నేను అతని టేబుల్ ముందు కూర్చుని మాట్లాడుతూంటే ఫోన్ మోగింది. అతను రిసీవర్‌ని ఓ అంగుళం పైకి లేపి మళ్ళీ దాన్ని క్రెడిల్ మీద ఉంచేశాడు. అవతలి వాళ్ళు ఎందుకో కట్ అయిందని అనుకుని మళ్ళీ చేస్తే, మళ్ళీ అదే పని చేశాడు. అలా అరడజనుసార్లు దాకా జరిగాక నేనతనితో 'అవతలి వాళ్ళకి కాల్స్ వేస్ట్ అవుతాయి మాట్లాడొచ్చుకదా?' అని చెపితే 'ఏం ఫర్లేదు' అన్నాడు. కానీ మాట్లాడలేదు. అతనికి ఫిక్షన్ మీద ఏ మాత్రం పట్టులేదు. ఎడిటర్‌గా అతనిలో అదోలోపం. కొత్త రచయితలని ఫోన్ చేసి పిలిపించి కావాలని వెయిట్ చేయించేవాడు. వాళ్ళని అతను అనేక విధాలుగా ఏడిపించేవాడు. నేనంటే అతనికి బాగా అయిష్టం. వీరేంద్రనాథ్ అంటే ఇష్టం. మేమిద్దరం విరోధులమనుకుని నాకన్నా లౌకికుడైన వీరేంద్రనాథ్ వైపు మొగ్గాడని నాకనిపించింది. వీరేంద్రనాథ్ మనుష్యుల తత్వాలను పసిగట్టి ఎవరితో ఎలా ప్రవర్తించాలో తెలిసిన చతురుడు. ఇది స్వభావ రీత్యా లేదా పుట్టుకతో అతనికి దైవదత్తంగా వచ్చింది. శివప్రసాద్ బలహీనత తెలుసుకాబట్టి తను చెన్నారెడ్డిగారితో ఒక్కమాట చెపితే చాలు శివప్రసాద్ ఉద్యోగం ఊడుతుంది అనే విషయాన్ని సూటిగా కాకుండా అతనికి స్పష్టం చేశాడు. వీరేంద్రనాథ్ ఏదీ ఎవరికీ సూటిగా చెప్పడని కానీ అది వారికి ఇంకొకరిద్వారానో, మరేవిధంగానో తెలియచేస్తాడని నా అబ్జర్వేషన్. ఇది నిజమో కాదో అనుకుని నేను చందు సోంబాబుతో ఈ విషయం చెపితే అతను నాతో కరచాలనం చేసి 'కరెక్ట్ గురూ' అన్నాడోసారి.

'పల్లకి' ఆఫీసు చుట్టూ ఇళ్ళుండేవి కావు. విసిరేసినట్లుగా దూరంగా ఉండేది. పెద్ద ఆవరణలోని ఆ పాతకాలం భవంతిలో మూడో అంతస్తులో ఒంటరిగా బ్రహ్మచారైన శివప్రసాద్ ఉండేవాడు. దాన్ని కొందరు సరదాకి భూత్ బంగళా అని పిలిచేవారు.

ఓ రచయిత - జి.వి. అమరేశ్వర రావు అనుకుంటా సరిగ్గా గుర్తులేదు, ఓ రాత్రి శివప్రసాద్ గదికి వెళితే చిన్నపిల్లలు ఆడుకునే బొమ్మలతో శివప్రసాద్ ఆడుకుంటూ కనిపించాడట. 'ఇదేమిటి'? అని అతను ఆశ్చర్యపోతే 'నా చిన్నప్పుడు నేను బొమ్మలతో ఆడుకోలేదు అందుకని ఇప్పుడు ఆడుకుంటున్నాను' అని జవాబు చెప్పాడట. కొత్త రచయితలని అతను అనేకసార్లు తిప్పించేవాడు. భూమిలో రాసే మాకు వచ్చిన ఖ్యాతి వల్ల అతనికి మా అందరి మీద రహస్యంగా అసూయ ఉండేది. అది మాలో చాలా మంది మీద ద్వేషంగా పరిణమించింది. చిత్రం ఏమిటంటే నేను అతని సీటు దగ్గరకి వెళితే లేచి నిలబడి గౌరవం ప్రదర్శించి మాట్లాడేవాడు. అతని మొహంలో ఎప్పుడూ చిరునవ్వు తొణికిసలాడేది. కానీ చర్యల్లో మాత్రం అతని చెడ్డతనం బయటపడేది.

నేను 'పల్లకి'కి రాసిన తొలి సీరియల్ 'లిటిల్ రాస్కెల్స్' చిన్నపిల్లవాడి సెంటిమెంటుతో రాసిన దాన్ని పాఠకులు బాగా ఆదరించారు. ఆ సీరియల్‌కి ప్రమోషన్ గా 'లిటిల్ రాస్కెల్స్' అనే శీర్షికని లోపలి, వెనుక లోపలి అట్టల్లో ప్రచురించారు. తమ పిల్లల ఫోటోలని అచ్చులో చూసుకోవాలని పాఠకులు ఆ శీర్షికకి కుప్పలు, తెప్పలుగా ఫోటోలు పంపారు. 2008లో లిటిల్ రాస్కెల్ 'నాన్న' పేరుతో టెలీ సీరియల్‌గా వచ్చింది.

'ఒక నువ్వు - ఒక నేను' అనేది పల్లకిలోని నా రెండో సీరియల్ దీనిలోని సినిమా సమాచారాన్ని శ్రీ రాజా నాకు ఇచ్చి సహాయం చేసారు. ఇది కూడా 1995 లో టెలీ సీరియల్‌గా వచ్చింది. దీన్ని కె.ఎస్. రామారావు నిర్మించారు.

'పల్లకి'లో సీరియల్స్ ఎవరివి వేయాలో శివప్రసాద్ చేతుల్లో లేదు. చెన్నారెడ్డే నిర్ణయించేవారు. శివప్రసాద్ సినిమా న్యూస్, కథలులాంటి ఇతర మెటీరియల్‌కి మాత్రమే ఎడిటర్. మొదట్లో సికరాజుతో చెన్నారెడ్డి సయోధ్యగా ఉండటం వల్ల భూమిలో రాసే వీరేంద్రనాథ్, నేనూ మొదలైన వారు పల్లకిలో రాయడానికి అభ్యంతరం చెప్పలేదు. కానీ వారిమధ్య సయోధ్య పోయాక సికరాజు పల్లకిలో రాస్తున్నందుకు నా దగ్గర గొణిగేవారు. భూమి వీక్లీ ఎడిటర్‌గా ప్రసిద్ధి చెందిన కందనాతి చెన్నారెడ్డి ఆధ్వర్యంలో పల్లకి అనే కొత్త వారపత్రిక వస్తోందని తెలిసిన పాఠకులు దానికోసం ఉత్సాహంగా ఎదురుచూసారు. చందు సోంబాబు, వీరేంద్రనాథ్, నా సీరియల్స్ ప్రారంభ సంచిక నుంచే మొదలవడంతో, చెన్నారెడ్డిగారికి భూమి వీక్లీ ఏజెంట్లందరితో భూమిలో జనరల్ మేనేజరుగా పనిచేసినప్పటి పరిచయాలతో త్వరలోనే పల్లకి సర్క్యులేషన్ బ్రేక్ ఈవెన్‌ని దాటింది. అంటే లాభాలు త్వరగానే మొదలయ్యాయి.

పల్లకికి వినాయకరావు ఫిలిం జర్నలిస్టుగా పనిచేసేవాడు. మరొకతను కాదంబరి కిరణ్ కుమార్. ఓ రోజు కాదంబరి కిరణ్ కుమార్ నా సలహా అడిగాడు.

"నేను జర్నలిస్టుగా మానేసి సినిమా నటుడవుదామనుకుంటున్నాను. మీ సలహా ఏమిటి?"

"వద్దు ఆ రంగంలో నెగ్గుకు రావడం కష్టం ఆట్టే వేషాలు, వేషాలున్నా సంపాదనా రాదు." వెళ్ళొద్దని గట్టిగా చెప్పాను. అయినా వెళ్ళాడు. జర్నలిస్టుగా సంపాదించేదానికంటే ఎక్కువే సంపాదించాడు. నా సలహాని అతను పాటించి ఉంటే నష్టపోయి ఉండేవాడు. అయితే నటుడిగా నిలబడ్డానికి అతను ఎక్కువ కష్టాలు పడ్డాడు. జర్నలిస్టుగా ఉంటే ఎలాంటి కష్టాలు ఉండేవి కావు.


కిరణ్‌ప్రభ

'పల్లకి'లో వ్రాస్తున్న రోజుల్లో అనేక మంది రచయితలని కలిశాను. వారిలో శ్రీ కిరణ్‌ప్రభ ఒకరు. అప్పట్లో ఆయన పల్లకి లోపలి పేజీల్లో ఫోటోకవితలు రాస్తుండేవారు. నేను రెండోసారి అమెరికాకి వచ్చినప్పుడు ఆ పరిచయంతోనే నన్ను శాన్‌ఫ్రాన్సిస్కోలోని వారింటికి ఆహ్వానించారు. (ఆ వివరాలు అమెరికాలో మరోసారి అనే పుస్తకంలో రాసాను).

మీరు చదివే ఈ కౌముది.నెట్ ని నిర్వహించేది కిరణ్‌ప్రభగారే.

'పల్లకి'లో పనిచేసిన వారిలో మరికొంతమందిని గుర్తుచేస్తూ కిరణ్‌ప్రభ ఇలా చెప్పారు "పల్లకి మొదలుపెట్టిన కొత్తలో పి.వి.కె.ప్రసాద్ అనే మిత్రుడొకాయన ఎక్కౌంట్స్ విభాగంలో పనిచేశారు కొన్ని రోజులు. ఆయన అంతకు ముందే బోయిన సుబ్బారావు గారి దర్శకత్వంలో కృష్ణ, జయప్రద హీరో హీరోయిన్లుగా 'జతగాడు' అనే సినిమా తీసి దెబ్బతిని ఉన్నారు. ఆ సినిమా కోసమని ఇ.సి.ఐ.ఎల్ లో చేసే ఉద్యోగాన్ని వదిలేశారు. కొంతకాలం 'పల్లకి'లో పనిచేశాక మళ్ళీ ఇ.సి.ఐ.ఎల్ లో ఉద్యోగం వచ్చింది ప్రసాద్ గారికి. అయన స్టేజి నాటకాలు ఎక్కువగా వేస్తుండేవారు."


విజయబాబు

ఆరోజుల్లో రాజకీయ సామాజిక వారపత్రికలు కూడా వచ్చేవి. ఆ ఫార్మాట్‌తో ఇలాంటి పత్రికలు ఇప్పుడు లేవనే చెప్పాలి. ఆరోజుల్లో సామాజిక, రాజకీయ శీర్షికలు కలిసి వారపత్రికలు వచ్చేవి. పింగళి దశరథ రాం రాజకీయ పత్రిక 'ఎన్ కౌంటర్' బాగా పాపులర్. అలాగే భూమి వీక్లీ. ఈ రెండు సక్సెస్‌ఫుల్ కాంబినేషన్స్‌తో కొన్ని వారపత్రికలు వచ్చాయి. అలాంటి పత్రిక 'ఈతరం'ని చెన్నారెడ్డి తీసుకువచ్చారు. దానికి విజయవాడ నుంచి వచ్చే 'వెలుగుబాట' అనే పత్రికని చూసే విజయ్ బాబు (విక్రం అన్నయ్య) అనే జర్నలిస్టుని తీసుకువచ్చారు. అతను విజయవాడలో రౌడీ అని ఆఫీసులో కొందరు చెప్పారు. ఆశ్చర్యంగా అతను ఎంతో సాత్వికుడు. ఎక్కడా రాజకీయాలు కానీ, గూండాయిజం కానీ చేయలేదు. బెజవాడలో అతను యాంటీ కమ్యునిస్ట్ వర్గంలో గట్టి పాత్ర పోషించాడని పాంప్లెట్స్ వార్‌లో పాల్గొన్నాడని ఓ సారి ఆయన చెపితేనే తెలిసింది.

విజయబాబు 'ఈ తరం'లో ఎడిటర్‌గా చేరటానికి మునుపు చెన్నారెడ్డి ఆయనతో చెప్పారు.

"మూడు సంచికలు తెండి. సర్క్యులేషన్ పెరిగితే కొనసాగిస్తాను. లేదా మూసేస్తాను."

విజయబాబు మొదటి సంచికలో రాయలసీమ విమోచన సమితి మీద, రెండో సంచికలో ఎన్.టి.ఆర్ ముఖ్యమంత్రిగా ఉండగా జరిగిన నక్సలైట్ల బూటకపు ఎన్‌కౌంటర్ల మీద, మూడో సంచికలో ఐ.పి.యస్. ఆఫీసర్ వ్యాస్ కలప కుంభకోణం మీద గట్టి వ్యాసాలు రాసారు. దాంతో దాని సర్క్యులేషన్ పెరిగి మరికొన్ని నెలలు కొనసాగింది.

చెన్నారెడ్డిగారి ప్రెస్‌లో దొంగతనంగా టెక్స్ట్ బుక్స్ ముద్రిస్తున్నారన్న అభియోగం వచ్చింది. పొలిటికల్ పత్రిక నడపడం ద్వారా తను ప్రభుత్వానికి శత్రువుగా నిలిస్తే జరిగే ఇలాంటి ఇబ్బందులు గ్రహించాక చెన్నారెడ్డి 'ఈ తరం'ని నిలిపేశారు. అదే తరుణంలో 'తరంగిణి' అనే యువతరంగ పత్రిక యువతకోసం విజయబాబు ఆధ్వర్యంలోనే వచ్చింది. తరువాత అది రాజా సంపాదకత్వంలో సినిమా వార పత్రికగా కూడా కొంతకాలం వచ్చింది. విజయ్‌బాబు ప్రస్తుతం 'ఆంధ్రప్రభ' దినపత్రికకి ఎడిటర్‌గా ఉన్నారు.

ఓ రోజు చెన్నారెడ్డిగారు నన్ను పిలిచి తను ఇంకో వారపత్రికని తీసుకురాదలచుకున్నానని దానికి నన్ను ఎడిటర్‌గా ఉండమని కోరారు. దాని ధర కేవలం రూపాయి మాత్రమే ఉంటుందని అందువల్ల ఆ పత్రిక బాగా అమ్ముడవుతుందన్న నమ్మకం తనకి ఉందని చెప్పారు. తమిళంలో తక్కువ ధరకి అమ్మే 'కుముదం' 'ఆనంద వికటన్'లు మళయాళంలో రూపాయి వారపత్రికలు దీనికి ప్రేరణ.

"వీరేంద్రనాథ్ గారిని అడిగారా?" వెంటనే నేను ప్రశ్నించాను.

"లేదు మిమ్మల్నే అనుకున్నాను. మీరు ఓకే అంటే పత్రిక మొదలుపెడతాను. లేదా మానేస్తాను" ఆయన జవాబు చెప్పారు.

ఆలోచించుకోడానికి టైము అడిగాను. అప్పటికే వారానికి రెండు వారపత్రికలకి రెండు సీరియల్స్ రాస్తున్నాను. ప్రభుత్వోద్యోగంలో ఉన్నాను. ఇంకా 'ఈనాడు' ఆదివారం, 'చతుర', 'విపుల'లు మరికొన్ని పత్రికలకి కథలు రాస్తూ బిజీగా ఉన్న నాకు వారపత్రికని నడిపేంత సమయం ఉంటుందా అని ఆలోచించాను. షిఫ్ట్ అవడానికి సంపాదకుడి ఉద్యోగం మీద నాకు వ్యామోహం లేదు. కాబట్టి రచయితగానే కొనసాగాలన్నది నా నిర్ణయం.

రెండు రోజుల తరువాత వారిని కలిసి నా కండీషన్స్ చెప్పాను. వారానికి నాలుగు రోజులు మాత్రమే రోజుకో రెండు గంటలు చొప్పున వారి ఆఫీసుకి వచ్చి పనిచేస్తాను. పత్రిక కంటెంట్ విషయంలో నాకు పూర్తి స్వేచ్ఛ కావాలి. ఎవరి ప్రమేయం ఉండకూడదు. ప్రచురించే ప్రతి రచనకి తప్పక పారితోషికం ఇవ్వాలి. సాటి రచయితనైన నేను ఎడిటర్‌గా నడిపే పత్రిక నుంచి రచయితలు పారితోషికం ఆశిస్తారు. ఆ విషయం మీద వారు నన్ను విమర్శించడం నాకు ఇష్టం లేదు.

అన్నిటికీ ఆయన ఒప్పుకున్నారు. జీతంగా నెలకి 1500రూపాయలు అడిగాను. కానీ 1250 మాత్రమే నిశ్చయమైంది. ఇది నిశ్చయమైన పద్ధతి నాకు ఇప్పటికీ ఆశ్చర్యంగా ఉంటుంది.

జీతం గురించి ఫైనలైజ్ చేసే రోజు సాయంత్రం నేనాయన ఆఫీసు గదిలోకి వెళ్ళినప్పుడు కొంత బేరసారాలు సాగాక ఓ పాయింట్ దగ్గర ఇద్దరికీ రాజీ కుదరలేదు.

వెంటనే ఆయన లేచి టేబుల్ మీది పళ్ళెంలోని హారతి కర్పూరం వెలిగించి చెప్పారు.

"చెప్పండి 1250 మా ఆఖరి మాట. పత్రికనుంచి నాకు లాభాలు వస్తే అప్పుడు 1500లు చేస్తాను. ఈ హారతి ఆరిపోయేలోగా మనం డిసైడ్ చెయ్యాలి"

*(మిగిలిన విశేషాలు వచ్చేనెల)*

**NEW**
Click here to share your comments on this story